క్లుప్తంగా

విద్యార్థిని ఫీజుకు 'మానవత ' ఆర్థిక సాయం

నల్లజర్ల: పేద విద్యార్థిని చదువుకు మానవత సంస్థ ఆర్థిక సాయం చేసింది. మండలంలోని తెలికిచెర్లకు చెందిన మునగా జస్వంతి శరణ్య నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాలలో బీఎస్సీ ఫైనలియర్ చదువుతోంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆమె కళాశాల ఫీజు చెల్లించలేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న మానవత సంస్థ మండల శాఖ సభ్యులు సోమవారం ఆ కళాశాలకు వెళ్లి ఆ విద్యార్థిని ద్వారా రూ.10 వేల చెక్కును కళాశాల చైర్మన్ కంఠమణి నారాయణ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, కార్యదర్శి ఉప్పాడ కామేశ్వరరావు, ఈసీ ఎడ్యుకేషన్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భూషణం, నాయకులు

నిడదవోలు: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఐక్య ఉద్యమాన్ని ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఈ. భూషణం కోరారు. ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకునేందుకు, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 8న అఖిలపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చామన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహర్షి సూర్య, రాజేష్, బహుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్టు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చితలపూడి సునీల్ తెలిపారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం, డిగ్రీ, పీజీ కళాశాల వద్ద కరస్పాండెంట్ డి.సువర్ణరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్, అధ్యాపకులు బి.మోహన్‌రావు, సీహెచ్ వెంకట్రావు, కె. సుధారాణి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి దారవరం రైల్వే గేట్ మూసివేత

చాగల్లు: మండలంలోని దారవరం రైల్వే గేట్ వద్ద రైల్వే లైన్ మరమ్మతులు మంగళవారం నుంచి మొదలవుతున్నాయి. ఈ పనుల కోసం మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ గేట్‌ను మూసి వేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. గేటు ఉన్న ప్రదేశంలో కుంగిన ట్రాక్‌లను ఎత్తు చేస్తామని, పాడైన కాంక్రీట్ స్లీపర్స్‌ను తొలగించి కొత్తవి వేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు, ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఈ నాలుగు రోజులూ ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించాల్సిందే.

యూటీఎఫ్ మండల నూతన కౌన్సిల్ ఎన్నిక



లింగంకొంటి రామారావు, మండల అధ్యక్షుడు



బర్నింకల నాగేంద్రప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి

దేవరపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) దేవరపల్లి మండల శాఖ నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కె.పుష్పబిందు అధ్యక్షతన సోమవారం సాయంత్రం యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మండల నూతన కౌన్సిల్ గౌరవాధ్యక్షుడిగా ఓరుగంటి శివ నాగప్రసాద్, అధ్యక్షుడిగా లింగంకొంట రామారావు, ప్రధాన కార్యదర్శిగా బర్నింకల నాగేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పెన్నాడ విజయబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా డి. రమాజానకి, కోశాధికారిగా కొమారపు ఉమాకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఉస్సే శంకరుడు, జిల్లా కార్యదర్శి మనోహర్, నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడు బండి కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హడలిపోతున్న అన్నదాత

- మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం
- ఈశాన్య రుతు పవనాల ప్రభావం
- పంట ఒబ్బిడికి విఘాతం కలుగుతుందనే భయం



కొవ్వూరు మండలం దొమ్మేరు సమీపంలో వరి పంట ఒబ్బిడిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు: వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈశాన్య రుతుపవనాలు, తూర్పు గాలుల ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నది ఆ హెచ్చరికల సారాంశం. ఈనెల ఒకటో తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా చెదురుమదురుగా వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం అయ్యాయి. మూడు, నాలుగు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు జోరందుకున్నాయి. చాలాచోట్ల మాసూళ్లు చేసిన ధాన్యం పొలాల్లో ఉంది. పంట ఒబ్బిడికి ఇబ్బందులు తలెత్తుతాయనే భయం రైతులను వెంటాడుతోంది. ఈ సమయంలో వర్షం కురిస్తే పంటకు నష్టం కలిగే అవకాశం ఎక్కువ. అందుకే వాతావరణ పరిస్థితులను చూసి అన్నదాతలు హడలిపోతున్నారు. 2వ తేదీ ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయానికి జిల్లాలో 2.8 మిల్లీ మీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. 3 నుంచి ఆరో తేదీ వరకూ వరుసగా రోజూ జిల్లాలో ఏదో ఒక మండలంలో ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. సోమవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని ఉండ్రాజవరం మండలంలో 11.8, పెరవలి మండలంలో 6.8 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది. వరికోతలు జరుగుతున్న తరుణంలో వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఎదురైన ప్రతికూల పరిస్థితులే పునరావృతం అవుతాయేమోనని వారు భీతిల్లుతున్నారు.

5.8 శాతం ఆయకట్టులో కోతలు పూర్తి

జిల్లా వ్యాప్తంగా 70,877 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. ఇందులో ఇప్పటి వరకూ 5.8 శాతం ఆయకట్టులో వరి కోతలను పూర్తి చేశారు. జిల్లాలో సోమవారం సాయంత్రానికి అధికారిక లెక్కల ప్రకారం 4,096 హెక్టార్ల విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యాయి. మండలాల వారీగా రాజమహేంద్రవరం రూరల్‌లో గరిష్టంగా 31.7 శాతం విస్తీర్ణంలో కోతలు పూర్తి చేశారు. సీతానగరంలో 10.5 శాతం, రాజానగరంలో 13.3, నిడదవోలు, కొవ్వూరు మండలాల్లో సుమారు పది శాతం ఆయకట్టులో వరికోతలు పూర్తి చేశారు. దీనిలో కామన్ వెరైటీ 1,911 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అందులో ఇప్పటి వరకూ 983 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించారు. ఫైన్ వెరైటీ 2,185 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే దీనిలో 13,860 టన్నులు బహిరంగ మార్కెట్‌లో వ్యాపారాలు కొనుగోలు చేశారు.

జిల్లా సరాసరి వర్షపాతం

తేదీ	మిల్లీ మీటర్లలో...
2న	2.8
3న	1.6
4న	1.8
5న	6.9
6న	1.0

లైసెన్స్ ఉన్నవారే బాణసంచా విక్రయించాలి



పెరవలిలో బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ

పెరవలి: లైసెన్స్ పొందిన వారు మాత్రమే దీపావళి బాణసంచా అమ్మకాలు సాగించాలని, అనుమతి లేని విక్రేతలపై చర్యలు తప్పవని కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ హెచ్చరించారు. పెరవలిలోని హోల్‌సేల్ బాణసంచా దుకాణాలను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బాణసంచా దుకాణం వద్ద ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. అంతే గాకుండా ప్రతి దుకాణం వద్దా 200 లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన డ్రమ్ములను ఉంచాలన్నారు. హోల్‌సేల్ షాపుల వద్ద తీసుకున్న చర్యలు బాగున్నాయని అభినందించారు. నిడదవోలు సీఐ కె. వెంకటేశ్వరరావు, పెరవలి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: దీపావళి బాణసంచా తయారీదారులు, విక్రయదారులు విధిగా నిబంధనలు పాటించాలని సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ సూచించారు. మండలంలోని గోపవరం శివారులో బాణసంచా శాశ్వత విక్రయ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దీపావళి సామాగ్రి విక్రయానికి లైసెన్స్‌తో పాటు భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాణసంచా అనధికార నిల్వలు, విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

గ్యాస్ లీకై చికెన్ షాపు దగ్ధం

ఉండ్రాజవరం: ప్రమాదవశాత్తూ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఉండ్రాజవరంలో సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో వి.ప్రసాద్‌కు చెందిన చికెన్ దుకాణం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కోళ్లు, గ్యాస్ సిలిండర్, వేయింగ్ మెషీన్, కుర్చీలు కాలిపోయినట్టు తణుకు ఫైర్ ఆఫీసర్ ఐ.అజయ్‌కుమార్ తెలిపారు. సుమారు రూ.20 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ప్రజా సంకల్పయాత్ర.. మరుపురాని చరిత్ర

- హోం మంత్రి తానేటి వనిత
- ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా దొమ్మేరులో వేడుకలు



దొమ్మేరులో కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: దేశ రాజకీయాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఒక సంచలనం, మరపురాని చరిత్ర అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మండలంలోని దొమ్మేరులో మంత్రి వనిత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మళ్లీ రాజన్న రాజ్యం తేవాలన్న సంకల్పంతో ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకూ జగనన్న పాదయాత్ర పూర్తి చేశారన్నారు. పాదయాత్ర ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకు వెళ్లి వాళ్ల కష్ట సుఖాలు స్వయం చూసి తెలుసుకున్నారన్నారు. అందుకే అన్ని వర్గాల ప్రజల మన్ననలు అందుకునేలా నేడు రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని మంత్రి వనిత అన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కులాలు ,మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన మేని ఫెస్టోను ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి జగన్‌మోహన్‌రెడ్డి తన విశ్వసనీయతను నిరూపించుకున్నారన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజల చెంతకే చేర్చారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా సంక్షేమ పథకాలను పాదర్శకంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణ రాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, సర్పంచ్ తానేటి కుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, స్థానిక నాయకులు బొల్లిన సతీష్, కొమ్మన మణిబాబు, ఎంఎస్ రాజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, ఉప్పులూరి సూరిబాబు పాల్గొన్నారు.

జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు, ఎంపీపీ తదితరులు

తాళ్లపూడి: ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో అక్రిడిటేషన్ ఉన్న పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తీర్మానం చేయడంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. తాళ్లపూడి మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు సోమవారం ప్రభుత్వానికి, హోం మంత్రి తానేటి వనిత, సమాచార శాఖ మంత్రి వేణుగోపాల కృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, మండల మాజీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవనారాయణ, ఏఎంసీ చైర్మన్ వల్లభ శెట్టి శ్రీనివాస్, పార్టీ నాయకుడు నూతంగి సురేష్ సమక్షంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కేక్ చేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ప్రమోద్ మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలోని పాత్రికేయులు అందరికీ ఇళ్ల స్థలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని హోం మంత్రి వనితను మీడియా ద్వారా కోరారు. ప్రెస్ క్లబ్ కన్వీనర్ అప్పన రాజా, పలువురు విలేకరులు పాల్గొన్నారు.

సురక్షతో పేదల వైద్యానికి భరోసా

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- సంజీవపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



సంజీవపురంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని సంజీవపురం సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాల ద్వారా పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. శిబిరంలో 210 మందికి వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో 11 మందిని కంటి, కిడ్నీల వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి సిఫార్సు చేసినట్టు డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. శిబిరంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ ఇళ్ళ శ్రీరామమూర్తి, వైఎస్సార్ సీపీ మండల శాఖ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, సర్పంచులు పఠాన్ అన్వర్‌బాషా, హరిబాబు, గెల్లా వెంకట శ్రీను, కంకట బ్రహ్మానందం, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి, తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై సోమవారం దేవరపల్లి వద్ద ఐదు కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దేవరపల్లి వద్ద హైవే పై పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కడప జిల్లా కమలాపురం మండల రామచంద్రపురానికి చెందిన చెట్టే ప్రతాపరెడ్డి, ఆకులపాట్ల సాయిఅఖిల్, మరో 17 ఏళ్ల మైనర్ బైక్‌పై గంజాయిని తరలిస్తూ పోలీసులకు చిక్కారు. వారు ముగ్గురూ అరకు దగ్గర పూజారి రఘు అనే వ్యక్తి నుంచి ఈ గంజాయిని కొనుగోలు చేసి, కడపలో ఒక వ్యక్తికి అందజేసేందుకు తీసుకు వెళుతున్నారు. అరకులో గంజాయి సరఫరా చేస్తున్న రఘును, కడపలో కొనుగోలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయవలసి ఉందని దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న ప్రతాపరెడ్డి, సాయి అఖిల్‌ను, మైనర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మొదటి ఇద్దరినీ కొవ్వూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. 17 ఏళ్ల మైనర్‌ను ఏలూరులోని బాలల కోర్టులో హాజరు పరిచినట్టు ఆయన చెప్పారు. వాహన తనిఖీల్లో ఎస్సై కె. శ్రీహరిరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ మేలు

- హోం మంత్రి తానేటి వనిత
- దొమ్మేరు–2 సచివాలయం పరిధిలో గడప గడపకూ..



దొమ్మేరులో వృద్ధుడికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత



పాలంగిలో మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ మేలు చేకూర్చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. మండలంలోని దొమ్మేరు–2 సచివాలయం పరిధిలోని దొమ్మేరు సావరంలో సోమవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగున్నరేళ్లగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరినీ మంత్రి వనిత ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, స్థానిక నాయకులు బొల్లిన సతీష్, కొమ్మన మణిబాబు, సర్పంచ్ తానేటి కుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు పోసిన శ్రీకృష్ణ దేవరాయులు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్దకూ పాలన

ఉండ్రాజవరం: పాలనను ప్రతి ఇంటి గడప వద్దకూ తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని పాలంగి గ్రామంలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ బొక్క శ్రీనివాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం సీఎం జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తయి సోమవారం నాటికి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల సమక్షంలో ఎమ్మెల్యే భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, బొక్క శివకుమార్, పాలాటి శరత్‌బాబు, వైస్ ఎంపీపీలు నరహరశెట్టి సరోజ, చెట్టే నవీన్, ఏఎంసీ వైస్ చైర్మన్ వేటిచేటి జానకిరామయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల అండర్ -19 కబడ్డీ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు 24 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

నిడదవోలు: స్థానిక సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 67వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల బాలబాలికల అండర్ –19 కబడ్డీ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. 13 జిల్లాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో బాలుర జట్టుకు 12 మంది, బాలికల జట్టుకు 12 మందిని ఎంపిక చేసినట్టు పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. సింగవరం సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పెన్మత్స చందు, పట్టణానికి ప్రముఖ వైద్యులు కల్యాణ చక్రవర్తి, పరిమి వినోద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు.

'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే'పై ప్రచారం

- వలంటీర్లతో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు భేటీ
- 9 నుంచి మండలంలో పల్లె నిద్ర



వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించేలా వలంటీర్లు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. మండలంలోని వలంటీర్లతో సోమవారం సాయంత్రం స్థానిక అల్లాడ రామయ్య కల్యాణ మండపంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 40 రోజుల పాటు ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తూ పల్లె నిద్ర చేస్తామన్నారు. తనతో పాటు పలువురు నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తలారి చెప్పారు. పల్లె నిద్ర అనంతరం తామందరం గృహ సందర్శన చేస్తామన్నారు. ఏయే ఇళ్లలో ఎవరెవరికి ఏయే పథకాల ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందనే విషయాలు తెలియజెబుతామన్నారు. ఏపీకి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ఎందుకు కావాలి అనే అంశంపై చర్చిస్తూ మళ్లీ ఆయనను సీఎంగా ఎన్నుకోవడం వల్ల రాష్ట్రాభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, చెల్లారి రామ శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ కఠారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనకు వీలుగా తీర్మానం హర్షణీయం

కొవ్వూరు: ఈనెల 21 నుంచి బీసీ కుల గణన చేపట్టాలంటూ రాష్ట్రమంత్రి మండలి తీర్మానం చేయడం హర్షణీయమని ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ పేర్కొన్నారు. సంఘం కొవ్వూరు పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు పట్నాల శ్రీనివాస్ షాపు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులగణన జరిపి, దానికి చట్టబద్ధత కల్పించాలంటూ శతాబ్దాలుగా తాము చేస్తున్న డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణపడి ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి పంపినప్పటికీ కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధతకు వీలుగా తీర్మానం చేయకపోవడం బాధాకరం అన్నారు. బీసీ కులగణన పూర్తయితే వారికి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరంగా అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. నాయి బ్రాహ్మణులకు దామాషా పద్ధతి ప్రకారం దక్కాల్సిన అన్ని రకాల సౌకర్యాలకు చట్టబద్ధత లభిస్తుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మేడూరి వీర్రాజు మాట్లాడుతూ జిల్లాలో నాయీ బ్రాహ్మణ సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసి తమ సంఘం సూచనలు, సలహాలను ప్రభుత్వానికి తెలియజేయాలని సూచించారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తణుకు సూర్య, జిల్లా కోశాధికారి పొన్నాడ సూరిబాబు, పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు పట్నాల శ్రీనివాస్, పట్టణ శాఖ అధ్యక్షుడు చింతలపూడి ప్రసాద్, ఏపీ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కోశాధికారి పెదపాటి గురున్నాథం పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

- మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి
- గోష్పాద క్షేత్రంలో 'కార్తిక ' మాస ఏర్పాట్ల పరిశీలన



గోష్పాద క్షేత్రంలో వసతులపై అధికారులతో మాట్లాడుతున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. ఈ నెల 12 నుంచి కార్తిక మాసం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మూడు రోజులుగా గోష్పాద క్షేత్రంలోని గోదావరి స్నాన ఘట్టాల వద్ద సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఇక్కడ పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపుతో పాటు పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఈ పనులను చైర్‌పర్సన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అదనపు విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయాలని, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు మరుగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ క్షేత్రంలోని ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేయాలని, పూజా ద్రవ్యాలు, ఇతర వ్యర్థాలను బయట వేయకుండా డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, కౌన్సిలర్లు కంఠమణి రమేష్, పిల్లలమర్రి మురళీకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీ రమణరావు తదితరులు పాల్గొన్నారు.